## భక్తిశ్రద్ధలతో కార్తీకపౌర్ణమి

నిజామాబాద్ కల్చరల్, నవంబర్ 27 : కార్తీకపౌర్ణమిని పురస్కరించుకొని నగరంలోని శివాలయాల్లో సోమవారం భక్తుల సందడి నెలకొన్నది. మహిళలు దీపారాధనలు, పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. తిథుల్లో పౌర్ణమి, నక్షత్రాల్లో కృతిక కలిసి రావడం విశేషమని పండితులు తెలిపారు. నగరంలోని నీలకంఠేశ్వరాలయం, కోటగల్లీలోని మార్కండేయ ఆలయం, గంగస్థాన్‌లోని ఉత్తర తిరుపతి క్షేత్రం, తేనె సాయి మందిరం, మనోకామేశ్వరాలయం, శ్రద్ధానంద్ గంజ్, ఉమమహేశ్వరాలయాల్లో భక్తులు స్వస్తిక్, ఓంకారం ఆకృతుల్లో దీపాలను వెలిగించారు. సకల దోషాలు తొలగాలని కోరుతూ ఉసిరిక దీపదానాలు చేశారు. గృహాల్లో అభిషేకాలు, సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు.

## సౌభాగ్యం తులసీ కల్యాణం



తులసీ కల్యాణం చేస్తున్న ఎమ్మెల్సీ కవిత, మహిళా ప్రజాప్రతినిధులు

నిజామాబాద్ కల్చరల్, నవంబర్ 27 : సకల సౌభాగ్యాలు ప్రసాదించే తులసీ కల్యాణం, సత్యనారాయణ వ్రతం కార్తీకమాసంలో విశేషమైనవని ఎమ్మెల్సీ కవిత అన్నారు. కంఠేశ్వర్ న్యూహౌసింగ్ బోర్డ్‌లోని తన స్వగృహంలో తులసీ కల్యాణం, సత్యనారాయణ వ్రతాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. శివకేశవులకు ప్రీతికరమైన కార్తీక పౌర్ణమి నాడు దీపారాధనలు, తులసీ కృష్ణ వివాహం, సత్యనారాయణ వ్రతం చేయడం అనాదిగా వస్తున్న సంప్రదాయమన్నారు. కార్యక్రమంలో కవిత కుటుంబ సభ్యులతో పాటు విశాలినిరెడ్డి, సుమనారెడ్డి, సూదం లక్ష్మి, శ్రీవాణి, వనిత, ఆడపడుచు అఖిల, తోటికోడలు నవిత పాల్గొన్నారు.

## ఘనంగా గురునానక్ జయంతి

నిజామాబాద్ కల్చరల్, నవంబర్ 27 : సిక్కుల ఆరాధ్యదైవం గురునానక్ జయంతి, కార్తీక పౌర్ణమి పర్వదిన వేడుకలను సిక్కులు సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. నగరంలోని గాజుల్‌పేటలో ఉన్న గురుద్వార్‌లో సంకీర్తలు, భజనలు, గురుగ్రంథ్‌కు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. నగరం నలుమూలల నుంచి సిక్కు కులస్తులు గురుద్వార్ చేరుకొని గురుగ్రంథ్‌ను దర్శించుకున్నారు. సాయంత్రం గురుగ్రంథ్ శోభాయాత్ర నిర్వహించారు. గురుద్వార్ ప్రబంధ కమిటీ ప్రతినిధులు నాందేడ్ గురుద్వార్ పండితులు, భక్తులు పాల్గొన్నారు.

## పవిత్రోత్సవాలు సంపూర్ణం



కలశాభిషేకం నిర్వహిస్తున్న పండితుడు

నిజామాబాద్ కల్చరల్, నవంబర్ 27 : జిల్లాకేంద్రంలోని సుభాష్‌నగర్ రామాలయంలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న పవిత్రోత్సవాలు సోమవారం సంపూర్ణమయ్యాయి. 81 కలశ పూజ, అభిషేకాలు తదితర కార్యక్రమాలను నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు తులసీ మురళీకృష్ణాచార్యులు తెలిపారు. ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన జరిగి 37 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా వేడుకలను నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమాలకు చిన్నజీయర్ స్వామి తదితరులు హాజరై ప్రవచనాలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు సరళా మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శోభ, కమిటీ ప్రతినిధులను వేదపండితులు మంగళశాసనాలతో అభినందించారు.

## అనాథశవానికి అంత్యక్రియలు

ఖలీల్‌వాడి, నవంబర్ 27 : వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందిన గుర్తు తెలియని ఓ అనాథ శవానికి ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. నగరంలోని దేవీ టాకీస్ వద్ద ఉన్న శ్మశానవాటికలో 3వ టౌన్ సిబ్బంది సహాయంతో అంత్యక్రియలు నిర్వహించినట్లు సంస్థ అధ్యక్షుడు సాయిబాబు తెలిపారు. కార్యక్రమంలో ఇందూరు యువత సభ్యులు కాసుల సాయితేజ, జయదేవ్, పోలీసు సిబ్బంది సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# గులాబీ జోష్

- బిగాలకు మద్దతుగా జోరుగా ప్రచారం
- నగరంలో బీఆర్ఎస్ భారీ బైక్‌ర్యాలీ
- పాల్గొన్న పార్టీ అర్బన్ అభ్యర్థి బిగాల గణేశ్‌గుప్తా





నగరంలో బిగాల కు మద్దతుగా నిర్వహించిన బైక్‌ర్యాలీలో పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులు, యువత, ర్యాలీలో పాల్గొన్న బిగాల గణేశ్ గుప్తా

ఖలీల్‌వాడి, నవంబర్ 27 : అర్బన్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బిగాల గణేశ్‌గుప్తాకు మద్దతుగా పార్టీ శ్రేణులు జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా సోమవారం నగరంలో బిగాల గణేశ్‌గుప్తా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. నగరంలోని వినాయక్‌నగర్ హనుమాన్ జంక్షన్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ పూలాంగ్ చౌరస్తా, ఆర్‌ఆర్.చౌరస్తా, వర్ని చౌరస్తా, ఖిల్లా రోడ్డు, నెహ్రూపార్కు, గాంధీచౌక్, దేవీ రోడ్డు, శివాజీ చౌక్, సంజీవయ్య కాలనీ మీదుగా సుభాష్‌నగర్ తెలంగాణ తల్లి చౌరస్తా వరకు కొనసాగింది. ర్యాలీ పార్టీ నాయకులు, కార్యకర్తలు బిగాలకు మద్దతుగా నినాదాలు చేశారు. ప్రధాన కూడళ్ల వద్ద బిగాల గణేశ్‌గుప్తా మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే నగరం అభివృద్ధి చెందిందన్నారు. దేశం మొత్తం తెలంగాణ అభివృద్ధి వైపు చూస్తున్నదని, సీఎం కేసీఆర్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను చూసి కొనియాడుతున్నారని తెలిపారు. రాష్ట్రం పచ్చగా ఉందంటే అది సీఎం కేసీఆర్‌తోనే అని పేర్కొన్నారు. ఇందూరు సుందర నగరంగా మారిందని, అభివృద్ధిలో హైదరాబాద్ తర్వాత నిజామాబాద్ ముందు ఉన్నదని చెప్పారు. తనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూకిరణ్, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సుజిత్ సింగ్ ఠాకూర్, సూదం రవిచందర్, సత్యప్రకాశ్, సిర్ప రాజు, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## యోగా సాధకుల ప్రతిభ

ఖలీల్‌వాడి, నవంబర్ 27 : వసంత యోగా అకాడమీ – హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వివేకానంద కేంద్రంలో శనివారం రాత్రి భిన్న వయస్సు కలిగిన యోగా సాధకులకు పోటీలు నిర్వహించారు. అతి తక్కువ సమయంలో 108 రౌండ్ల సూర్యనమస్కారాలు వేసిన పలువురు.. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ తరపున రామ్మోహన్‌రెడ్డి న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. దయానంద యోగా కేంద్రం – శ్రీయోగా రాంచంద్ ఆధ్వర్యంలో 10 మంది సాధకులు పాల్గొని ఈ రికార్డు సాధించినట్లు తెలిపారు. ప్రతిభ చూపిన వారిలో గిరీశ్‌కుమార్, సుభాష్‌చంద్రబోస్, కిరణ్‌కుమార్, రాజేందర్, హెచ్.శ్రీనివాస్, పద్మ ఆకుల, ప్రశాంతి, రవళి, ప్రియాంక, ప్రసన్న ఉన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన యోగ సాధకులను యోగా రాంచంద్ అభినందించారు.



సర్టిఫికెట్లతో యోగా సాధకులు

## ఎంసీఎంసీ అనుమతి లేకుండా ప్రకటనలు ప్రచురించవద్దు

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు**

నిజామాబాద్ స్పోర్ట్స్, నవంబర్ 27 : ఎన్నికల సంఘం నిబంధనల మేరకు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) అనుమతి లేకుండా పోలింగ్‌కు ఒక రోజు ముందు, పోలింగ్ రోజు (ఈనెల 29, 30 తేదీల్లో) ప్రింట్ మీడియాలో ఎలాంటి ఎన్నికల ప్రచార ప్రకటనలను ప్రచురించవద్దని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకటనల కోసం వివిధ రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ఇతరులు ఎవరైనా ముందస్తుగా ఎంసీఎంసీ ద్వారా అనుమతి కోసం దరఖాస్తు చేసుకొని, ధ్రువీకరణ పొందాలని సూచించారు. లేకపోతే ఎన్నికల కమిషన్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈనెల 28, 29 తేదీల్లో ప్రింట్ మీడియాలో (వివిధ పత్రికల్లో) ఎన్నికల ప్రచార ప్రకటనలు ప్రచురితం చేయాలనుకునే వారు తప్పనిసరిగా ఎంసీఎంసీ ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే రీతిలో ఆవేశపూరితమైన, తప్పుదోవ పట్టించే ప్రకటనలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఇవ్వబోమని స్పష్టంచేశారు.


NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

★I, MAGGIDI RAMYA D/o. MAGGIDI MADHU, H.No. 6-42, Anksapoor, (M) Vailpoor, (D) Nizamabad Changed my Surname/ Name As BADDAM MEGHANA W/o. BADDAM PRAVEEN
NTZ-318687

**WANTED**

★రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. 9281452762, 9515108830.
NT-314461

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్ : 91827 77590

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.